బ్యాంకుల్లో నకిలీ బంగారం తాకట్టు!

రూ.కోట్లలో స్కాం.. జోరుగా చర్చ

విషయం పొక్కకుండా జాగ్రత్తపడుతున్న బ్యాంకర్లు

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 25 : ఖమ్మం నగరంలో అనేక బ్యాంకుల్లో నకిలీ బంగారం తాకట్టు పెట్టిన ఘటనలో ఖమ్మంరూరల్ మండలానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కరుణగిరి ప్రాంతానికి చెందిన ఓ ఆటోడ్రైవర్‌ను తొలుత ఎంచుకున్న కేటుగాళ్లు అతడి సహాయంతో అనేక మందిని బోల్తా కొట్టించినట్లు జోరుగా చర్చ జరుగుతున్నది. వివరాల్లోకెళ్తే.. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు సదరు ఆటోడ్రైవర్ సహాయంతో తీర్థాల, డాక్యాతండా, పెద్దతండా తదితర గ్రామాలకు చెందిన దినసరి కూలీలను లక్ష్యంగా చేసుకొని వారికి కొంత సొమ్ము ముట్టచెప్పి వారి అడ్రస్‌ల ద్వారానే అకౌంట్‌లు ఓపెన్ చేయించినట్లు విశ్వసనీయం సమాచారం. అనంతరం నకిలీ బంగారాన్ని ఆ వ్యక్తుల సహాయంతో బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా సదరు వ్యక్తులకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ముట్టచెప్పి పక్కాప్లాన్‌తో తిరిగి వారి ప్రదేశాలకు వెళ్లినట్లు తెలిసింది. ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నగరంలో దాదాపు 20 బ్యాంకుల్లో అకౌంట్లు ఓపెన్ చేసి నకిలీ బంగారం పెట్టి రుణాలు తీసుకున్నట్లు బ్యాంకు వర్గాలో చర్చ జరుగుతున్నది. రూరల్ మండలంలోని ఓ గ్రామీణ బ్యాంకు సిబ్బంది పసిగట్టి నకిలీ బంగారం పెట్టి రుణాలు తీసుకునేందుకు వచ్చిన మహిళను పట్టుకోవడంతో అసలు విషయం ఇతర బ్యాంకులకు లీకయినట్లు తెలుస్తున్నది. నకిలీ బంగారంతో వచ్చిన మహిళ ఆధార్‌కార్డు నెంబర్ బ్యాంకు సైట్‌లో నమోదు చేయడంతో అప్పటికే సదరు మహిళా పేరుతో అదే శాఖలకు చెందిన 10 బ్యాంకుల్లో బంగారు రుణాలు తీసుకున్నట్లు తేలింది. దీంతో ఆ మహిళను విచారించడంతో తీసుకున్న రుణాలను అదే రోజు చెల్లించి బయటపడినట్లు తెలిసింది. ఖమ్మం నగరంలోని 30 బ్యాంకుల్లో ఇదే తరహా మోసం జరిగినట్లు బ్యాంకు వర్గాలు చర్చించుకుంటున్నాయి. మొత్తంగా రూ.5 కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు సమాచారం. రూరల్ మండలంలోని కొందరు బినామీలు ఇప్పటికే విధిలేని పరిస్థితిలో కొంత మొత్తం చెల్లించినట్లు తెలిసింది. ప్రస్తుతం డీసీసీబీలోనే ఎక్కువ ఫ్రాడ్ జరిగినట్లు ప్రచారం జరుగుతున్నా ఇతర బ్యాంకుల్లో ఇంతకు పదింతలు కేటుగాళ్లు నకిలీ బంగారంతో రుణాలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. సదరు నకిలీ బంగారంను కొందరు బ్యాంకు అధికారులు సోమవారం ప్యూరిటీ యంత్రాల ద్వారా పరీక్షించినప్పటికీ కేడీ ఎంగా చూపెట్టినట్లు తెలిసింది.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సత్తుపల్లి, నవంబర్ 25: స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలని, లాభదాయక యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన తల్లాడలో ఇందిరా మహిళా శక్తి కింద ఏర్పాటుచేసిన ఫ్యాన్సీ జనరల్ స్టోర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ స్టోర్‌లో ఏమేమి అందుబాటులో ఉంచారు, ఎంత రుణం తీసుకున్నారు, గతంలో వ్యాపార అనుభవం ఉందా అంటూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం తల్లాడ మండలం అంజనాపురం గ్రామాన్ని సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. వెదురుతో చాటలు, బుట్టలు, కేతి విసన్నకర్రలు, అలంకరణ సామగ్రి తయారీని పరిశీలించారు. ఖమ్మం టీటీడీసీ సమీపంలో డ్వాక్రాబజార్ త్వరలోనే ఏర్పాటు చేస్తామని, ఈ ఉత్పత్తులను డ్వాక్రా బజార్‌లో నేరుగా అమ్ముకుంటే లాభదాయకంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో ఎస్.సన్యాసయ్య, ఎంపీడీవో చంద్రమౌళి, డీపీఎంలు దర్గయ్య, శ్రీనివాస్,

తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామదీపికలు విజయలక్ష్మి ఉన్నారు.

స్థానిక సమస్యలు మండలాల్లోనే పరిష్కరించాలి

మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు మండలాల్లోనే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ తల్లాడ తహసీల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి సంబంధించి కలెక్టరేట్‌కు గత ప్రజావాణిలో 19దరఖాస్తులు వచ్చాయని, అందులో 10 దరఖాస్తులు మండలస్థాయిలోనే పరిష్కారమయ్యాయన్నారు. మండలంలో సర్వే ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రమౌళి, ఇన్‌చార్జి తహసీల్దార్ వనజ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రజాపాలన విజయోత్సవాలు

మామిళ్లగూడెం, నవంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో రెండురోజుల పాటు ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం 6గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలంలోని మద్దె ఎల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలేఖ్య కళాబృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్రజా అవసరాల మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలి: మంత్రి తుమ్మల

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబర్ 25 : ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ పీ శ్రీనివాసరెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి ఖానాపురం హవేలీ 4వ డివిజన్‌లో రూ.కోటి 43లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జి+1 భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీఎంహెచ్‌వో బీ కళావతిబాయి, కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, కమర్తపు మురళి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'బ్లూమింగ్‌మైండ్స్'కు ఎన్‌సీసీ పురస్కారం

పురస్కారాన్ని స్వీకరిస్తున్న బ్లూమింగ్ మైండ్స్ స్కూల్ కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 25: నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలకు ఎన్‌సీసీ 76వ దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ ఉత్తమ పాఠశాల పురస్కారాన్ని అందజేసింది. సోమవారం హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో మిలటరీ గారిసన్ గ్రౌండ్‌లో ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ పైడిమర్ల అశోక్‌రెడ్డికి అత్యున్నత పురస్కారాన్ని అందజేశారు. పురస్కారాన్ని అందుకున్న అశోక్‌రెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కిరణ్ కుమార్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ(టీ) వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీలాద్రి అర్బన్ పార్క్‌కు ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ మంజూరు

అర్బన్‌పార్క్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్, అధికారులు

సత్తుపల్లి టౌన్, నవంబర్ 25: సత్తుపల్లి నీలాద్రి అర్బన్‌పార్క్‌లో జంతువుల నమూనాలు చూడడం, అరుపులు వినిపించే, అడవులపై అవగాహన కల్పించడం కోసం రూ.60 లక్షలతో ఎన్విరాన్‌మెంటర్ ఎడ్యుకేషన్ సెంటర్(ఈఈసీ) మంజూరైందని అటవీశాఖ చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) భీమానాయక్ వెల్లడించారు. సోమవారం అర్బన్‌పార్క్‌ను జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌తో కలిసి సందర్శించారు. తొలుత సింగరేణి గెస్ట్ హౌస్‌లో సింగరేణి అధికారులతో వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. అర్బన్‌పార్క్‌లోని వన్యప్రాణులు పెన్సింగ్ లేని ప్రాంతం నుంచి బయటకు వెళ్లి ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయని స్థానికులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే సీసీఎఫ్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో అర్బన్‌పార్క్‌ను పరిశీలించారు. పార్క్‌లో లైబ్రరీ నిర్మించామని, ఇందులో అటవీశాఖ వన్యప్రాణులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌డీవో వాడవల్లి మంజుల, రేంజర్ పీ.స్నేహలత, డీఆర్‌ఓ ముత్యాలరావు, ఎఫ్‌ఎస్‌వో నరసింహా, ముక్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి అంబులెన్స్ విరాళం

అంబులెన్స్ తాళం అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సిటీ/ ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 25: సామాజిక బాధ్యతతో ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రికి యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు అంబులెన్స్ అందించడం అభినందనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ పెద్దాసుపత్రికి బహూకరించిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకర్ల సహకారంతోనే ప్రభుత్వం రూపొందించే వివిధ పాలసీలు, కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది శ్రమిస్తున్నారని కొనియాడారు. జిల్లా ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువైనప్పటికీ వెనక్కు పంపించకుండా మంచి సేవలు అందిస్తున్న యంత్రాంగాన్ని ప్రశంసించారు. అంబులెన్స్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఖమ్మం రీజినల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, పెద్దాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, బ్యాంక్ ఏజీఎం సర్వేశ్, సుధాకర్‌రావు, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, నవంబర్ 25: సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం గండుగులపల్లిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం కలిశారు. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మంత్రితో చర్చించారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం, నవంబర్ 25: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఖమ్మం నగరంలోని ఎంపీ రామసహాయం రఘురారెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. మధిర నియోజకవర్గంలోని మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని మండలాల నుంచి 25మందికి మొత్తం రూ.5 లక్షల మేరకు లబ్ధి చేకూరింది.

గ్రూప్-4 ఉద్యోగం సాధించిన ప్రవళిక

మధిర, నవంబర్ 25: మున్సిపాలిటీలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన దేవిశెట్టి కృష్ణ కుమార్తె ప్రవళిక గ్రూప్-4 ఫలితాల్లో ఓపెన్ క్యాటగిరిలో ఉత్తీర్ణత సాధించి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఖమ్మంలో ఉద్యోగం పొందారు. గ్రూప్-2 తన లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రూప్-4లో ఉద్యోగం సాధించిన ప్రవళికను పలువురు అభినందనలు తెలిపారు.

అక్రమ ఇసుక సీజ్

మధిర, నవంబర్ 25: పట్టణంలోని రాయపట్నం బ్రిక్స్ కంపెనీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను డంప్ చేసి ఉండగా తహసీల్దార్ సమక్షంలో పట్టణ ఎస్సై సంధ్య సోమవారం సీజ్ చేశారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తోలకాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

జన భోజనాలను జయప్రదం చేయండి

ఖమ్మం సిటీ, నవంబర్ 25 : మానవత్వం అనే కులం గుణం కలిగిన మంచి మనసుల కలయికతో జరుగబోతున్న జన భోజనాలను జయప్రదం చేయాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని బంజారేభవన్‌లో జరిగిన సమావేశంలో సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రవిచంద్ర చౌహాన్ మాట్లాడుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీన బల్లెపల్లిలో మలీదు జగన్ తోటలో జరుగబోతున్న జన భోజనాలకు అన్నివర్గాల ప్రజ లు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అన్నివర్గాల ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు కుల భోజనాలకు వెళ్లి వారి కులం గురించి గొప్పగా కీర్తించుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

రైతు ప్రయోజనాలే ధ్యేయం

నూతన సీఈవో వెంకట ఆదిత్య

'నమస్తే'తో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో వెంకట ఆదిత్య

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 25: వందకు వంద శాతం సహకార బ్యాంకులు రైతుల కోసమే పనిచేస్తాయని, తన నిర్ణయాలు రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ఉంటాయని డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట ఆదిత్య తెలిపారు. సోమవారం వసంతరావు నుంచి వెంకటఆదిత్య సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. 2010వ సంవత్సరానికి పూర్వం బీటెక్ పూర్తి చేసిన అనంతరం కొంతకాలం ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ విప్రోలో పనిచేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఆప్కాబ్‌లో మేనేజర్‌గా పనిచేశానని, తరువాత టెస్కాబ్‌లో బీడీవోగా, వివిధ హోదాల్లో పనిచేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం టెస్కాబ్‌లో ఏజీఎంగా విధులు నిర్వహిస్తూ ఖమ్మం డీసీసీబీకి ఇన్‌చార్జిగా బదిలీ అయినట్లు తెలిపారు. గతంలో అనేకసార్లు ఖమ్మం డీసీసీబీని టెస్కాబ్ అధికారిగా సందర్శించానని, నాలుగు జిల్లాల పరిధి, వంద సహకార సంఘాలతో ఎంతో బలంగా ఖమ్మం డీసీసీబీ ఉందన్నారు. బంగారు ఆభరణాల రుణాల విషయంలో తెలంగాణలోనే అగ్రగామిగా ఉందని, టర్నోవర్‌లో ద్వితీయ స్థానంలో ఖమ్మం డీసీసీబీ కొనసాగుతున్నదన్నారు. బ్యాంకు చైర్మన్, పాలకవర్గం సభ్యులు, బ్యాంకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సొసైటీల బాధ్యుల సహకారంతో ఖమ్మం డీసీసీబీని టెస్కాబ్‌లో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తానని అన్నారు. కోఆపరేటివ్ బ్యాంకులు అంటేనే వందవందకు వందశాతం రైతుల కోసం పనిచేసే సంస్థలన్నారు. సహకార బ్యాంకులను కాపాడుకునేందుకు, బలోపేతం చేసే బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ప్రస్తుతం సొసైటీలు, డీసీసీబీలు వాణిజ్య బ్యాంకులకు దీటుగా అనేక రకాలుగా ఖాతాదారులకు చేరువయ్యాయని అన్నారు.

'వీన్‌ఫీల్డ్'లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

గ్రాండ్ పేరెంట్స్‌తో వీన్‌ఫీల్డ్ స్కూల్ డైరెక్టర్స్

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 25: నగరంలోని వీన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో 1 నుంచి 5వ తరగతుల విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ హాజరయ్యారు. స్కూల్ డైరెక్టర్స్ గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అమ్మమ్మ, తాతాయ్యలకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లాన్ టెన్నిస్, బీచ్ వాలీబాల్ జట్లు సిద్ధం

ఖమ్మం సిటీ, నవంబర్ 25 : ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలబాలికల అండర్-14, అండర్-17 విభాగాల్లో లాన్ టెన్నిస్, బీచ్ వాలీబాల్ జట్లు సిద్ధమయ్యాయి. సోమవారం పోటీలకు 41 మంది బాలబాలికలు హాజరవ్వగా పటేల్ స్టేడియంలో లాన్ టెన్నిస్, సీక్వెల్‌లో బీచ్ వాలీబాల్ ఎంపికలను నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులను హైదరాబాద్‌లో టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలకు, మంచిర్యాలలో బీచ్ వాలీబాల్ పోటీలకు పంపించనున్నారు. వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ ఆయా పోటీలను పర్యవేక్షించారు. విజేతలను జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య కార్యదర్శి నరసింహామూర్తి ప్రకటించారు. బీచ్ వాలీబాల్‌కు అండర్-17 : జే విష్ణువర్ధన్, వై భాను, కే ప్రేమ్‌సాగర్, బీ అంబిక, ఎన్ దీపిక, కే ప్రసన్న ఎంపిక కాగా...అండర్-14 : వై రిషి, కే రాజు, కే జేమ్స్, ఎస్‌డీ ఆర్వ్య, ఈ ప్రణీత, వీ వర్షిత ఎంపికయ్యారు. లాన్ టెన్నిస్‌కు అండర్-17 : సయ్యద్ ఇషాన్ అహ్మద్ ఖాద్రి, కే స్వాప్నిల్, అండర్-14: కే వీరవర్ధన్, ఎన్ ధనుంజయ్‌రెడ్డి ఎంపికయ్యారు.

విద్యాప్రమాణాలు పెంచితేనే పేదలకు విద్య

ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

గంగబండతండా స్కూల్‌ల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రై కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

కూసుమంచి, నవంబర్ 25: విద్యా ప్రమాణాలు పెంచితే పేదలకు విద్య చేరువ అవుతుందని ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. కూసుమంచి మండలం గంగబండతండా, గుర్వాయిగూడెం పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతం కంటే పాఠశాలల్లో అనేక వసతులు పెరిగాయని, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు కొన్న ధాన్యం, ఇంకా ఎంత మంది సీరియల్‌లో ఉన్నారు. ఎన్ని రోజుల నుంచి కొనుగోలు కేంద్రం వద్ద ఎదురు చూస్తున్నారు తదితర వివరాలను వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణిని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొన్న వాటిని వెంటనే మిల్లర్లకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ఏఈవోలు, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎండీ సర్వర్

సీపీ సునీల్‌దత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీసీఎస్ ఏసీపీ సర్వర్

మామిళ్లగూడెం, నవంబర్ 25 : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) ఏసీపీగా ఎండీ సర్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డీజీపీ కార్యాలయం హైదరాబాద్ నుంచి ఖమ్మం సీసీఎస్‌కు బదిలీపై వచ్చారు.

సర్వే డేటా ఆన్‌లైన్‌ను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

బోనకల్లు, నవంబర్ 25: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కుల గణన డేటా ఆన్‌లైన్ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఈ నెల 30 నాటికి సర్వేకు సంబంధించిన డేటాను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పకడ్బందీగా డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసే విధంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. డేటా ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఆన్‌లైన్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీవో ఆర్.రమాదేవి తదితరులు ఉన్నారు.

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

కొణిజర్ల, నవంబర్ 25: ఎరువుల విక్రయాల్లో డీలర్లు నియమ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. సోమవారం మండలంలోని గుబ్బగుర్తి, తీగలబంజర, పెద్దమునగాల గ్రామాల్లోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం డీఏపీ, యూరియా ఎరువుల అవసరం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గరిష్ఠ ధరలకు లోబడి విక్రయించాలన్నారు. ఎరువుల నిల్వలు, అందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి దొడ్డిగర్ల బాలాజీ ఉన్నారు.

నగరంలో శిశువు విక్రయ కలకలం

ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

మామిళ్లగూడెం, నవంబర్ 25 : నగరంలో ఓ శిశువును విక్రయించే ప్రయత్నాలు కలకలం రేపాయి. ఖమ్మం రెండో పట్టణ సీఐ బాలకృష్ణ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరు మండలం పుల్లయ్య బంజరు గ్రామానికి చెందిన రుక్మిణి, ఆశ అక్కాచెల్లెల్లు. వీరు తమకు చెందిన నెలలు నిండిన శిశువును తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన సత్యవతికి విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే రుక్మిణిని సోదరి ఆశ శిశువుకు వచ్చిన డబ్బుల నుంచి తనకు కొంత వాటా కావాలని డిమాండ్ చేసింది. దీంతో రుక్మిణి శిశువు తన సంతానం కాబట్టి డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో కోపగించిన ఆశ మహిళ శిశు సంక్షేమశాఖ వారికి సమాచారం అందించింది. అప్రమత్తమైన వారు పోలీసుల సహకారంతో గత నాలుగురోజుల క్రితం వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. అయితే శిశువు విక్రయంలో ఎలాంటి నగదు లావాదేవీలు జరగలేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

పెనుబల్లి, నవంబర్ 25: రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలైన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పార్థసారథిపురం గ్రామానికి చెందిన రేగళ్ల శ్రీను బైక్‌పై తుమ్మలపల్లి గ్రామానికి వెళ్తుండగా ఎడ్లబంజర గ్రామశివారులో వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బంపర్ ద్విచక్ర వాహనం వెనుకవైపు తగిలింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కుర్చొన్న నేరేళ్ల వరుణ్‌కార్తీక్(9)కు గాయాలయ్యాయి. వెంటనే వరుణ్ కుమార్‌ను ప్రభుత్వ ఆసుపత్రి తరలించి వైద్యం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ పదం శివకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ముద్దంగుల నాగరాజు**, S/o.వెంకటరాములు, **వయస్సు**:41సం॥ల